కలెక్టరేట్ ఎక్కడనేది నిర్ధారించలేదు

అసత్య ప్రచారాలు నమ్మొద్దు - డిఆర్‌ఒ ఉదయభాస్కరరావు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న భవనాల్లోకి జిల్లా కలెక్టర్ కార్యాలయం వెళ్తుందని సాగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్ యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న భవనం ఎంపెడాకు మాత్రమేనని, కలెక్టర్ కార్యాలయానికి కాదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణం ఎక్కడ నిర్మించేది ఇంకా నిర్ధారణ కాలేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తే ముందే తెలియజేస్తామని తెలిపారు. ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని డిఆర్‌ఒ హెచ్చరించారు.

ప్రభుత్వ విధానాలతోనే.. సంక్షోభంలో వ్యవసాయం

రైతులకు గిట్టుబాటు ధర చట్టం అమలు చేయాలి

ఏపి రైతుసంఘం రాష్ట్రస్థాయి రైతు సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

'వ్యవసాయాన్ని కాపాడండి.. రైతులను రక్షించండి, వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరం' అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ద్వారకాతిరుమలలోని శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రైతుసంఘం జెండాను సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు ఆవిష్కరించారు. 'వ్యవసాయాన్ని కాపాడండి.. రైతును రక్షించండి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యఅతిథుల్లో ఒకరైన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, ఎపి రైతుసంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక రైతులు నష్టపోతున్నారన్నారు. గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో రూ.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని, రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతులంటే అంత చులకన భావం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రైతులు ఆరుతడి పద్ధతులు పాటించడం వల్ల గ్లోబల్ వార్మింగ్ తగ్గించొచ్చని, దిగుబడులు సైతం వస్తాయని అన్నారు. చెరకు, వరి పంటలు కోసేసిన తర్వాత చెత్తను తగలబెట్టకుండా రోటవేటర్తో కల్టివేట్ చేస్తే సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఎంతో బలంగా మారుతుందన్నారు. భూసారం పెరిగి దిగుబడులు పెరుగుతాయని వివరించారు. జన్యు మార్పిడి పంటలను ప్రోత్సహించరాదని, అలాంటి పంటలను రైతులు వేయవద్దని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పిస్తున్న మోడీ ప్రభుత్వం రైతుకు ఏ విధమైన రాయితీ కల్పించడం లేదన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఇన్సూరెన్స్ కంపెనీలకు వరంగా మారిందన్నారు. అన్ని పంటలకూ బీమా కల్పించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతి రైతుకూ అందించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు

సూర్యనారాయణ



వడ్డే శోభనాద్రీశ్వరరావు

వ్యవసాయం చేసే రైతులు తగ్గడం ఆందోళనకరం

వ్యవసాయం చేసే రైతుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. పంట రుణాలు, నష్టపరిహారాలు కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, అమూల్ వంటి సంస్థలను తీసుకువచ్చి విజయ వంటి సహకార డెయిరీలను దెబ్బతీశారని విమర్శించారు. అన్ని పంటల రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై దేశవ్యాప్త రైతు ఉద్యమం త్వరలో నిర్వహిస్తామన్నారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని, రుణ విమోచన చట్టం అమలు పరచాలని డిమాండ్ చేశారు. బోర్లకు విద్యుత్ మీటర్లను పెట్టే జిఒ22ను రద్దు చేయాలన్నారు. రైతాంగాన్ని చైతన్య పరచడానికి యువకులు, మహిళా రైతులు ఉద్యమంలోకి రావాలన్నారు. పండిన పంటకు 50 శాతం అదనపు ధర ఖర్చు లెక్కించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పారిశ్రామికవేత్తలు వస్తువులకు నూరుశాతం లాభాలు పొందుతున్నారన్నారు. రైతులు మాత్రం తాము పండించిన పంటకు ధర నిర్ణయించలేకపోతున్నాడని చెప్పారు. రైతాంగ ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు రైతాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మొగతడకల శ్రీనివాసరావు, తూంపాటి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అంతా అండగా నిలబడాలని కోరారు. సదస్సుకు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆహ్వానం పలికారు. సంఘం రాష్ట్ర నాయకులు జొన్నా శివశంకరరావు, పివి.ఆంజనేయులు, కె.మోహనరావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. చింతకాయల బాబురావు, ఆకుల హరేరాం, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

అలుపెరగని ప్రజా సేవకులు ఆర్ఎస్, శ్రీరామమూర్తి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

అలుపెరగని ప్రజా సేవకులు, ఆదర్శ ప్రజా నేతలు కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), వలవల శ్రీరామమూర్తి (మాస్టార్) అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. శుక్రవారం ఇరువురు నాయకుల సంస్మరణ సభ స్థానిక మీరా గ్రంథాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి బలరాం మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిపిఎం అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించిన ఆర్ఎస్ విద్యార్థి దశనుండే కమ్యూనిస్టు భావజాలంతో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములయారన్నారు. సొంత గ్రామంలోనే పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా బడుగు, బలహీనవర్గాల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడారన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ వంటి వాటి కోసం నిలబడి పోరాడిన ఆదర్శ ప్రజానేత ఆర్ఎస్ అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతు సంఘం, సిపిఎం సీనియర్ నేత వలవల శ్రీరామమూర్తి ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించి, సిపిఎం భావజాలంవైపు ఆకర్షితులై సర్వీస్ ఉండగానే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఉద్యోమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. రైతుల హక్కులు, గిట్టుబాటు ధర, తాగు, సాగునీరు కోసం అనేక ఉద్యమాలు నిర్మించిన ఘనత శ్రీరామమూర్తి సొంతమన్నారు. నీటిఎద్దడి సమయంలో దొంగరావిపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 40 వేల ఎకరాలకు నీరందించే విధంగా ప్రభుత్వం, సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి సాధించిన ఘనత శ్రీరామమూర్తి సొంతమన్నారు. ఆ మహనీయులు చూపిన ఆదర్శాలను పుణికిపుచ్చుకొని యువతరం ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నెక్కంటి క్రాంతికుమార్, ఆరేటి మృత్యుంజయ, వేములదీవి మాజీ సర్పంచి అడ్డాల శ్రీనివాస్, సిపిఎం నేతలు పొగాకు పూర్ణ, ముచ్చర్ల త్రిమూర్తులు, జల్లి రామ్మోహన్‌రావు, తెలగంశెట్టి సత్యనారాయణ, యడ్ల చిట్టిబాబు, ఆదుర్తి సాంబమూర్తి, నోముల కొండ, పొగాకు నారాయణరావు, కానేటి బాలరాజు, బూడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30వ తేదీన స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం వైపు నుంచి, యాజమాన్యం వైపు నుంచి ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం వల్ల ఈ కాలంలో ప్రమాదాలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. ఫలితంగా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నాయని తెలిపారు. గతంలో పని ప్రదేశాల్లో కార్మిక శాఖాధికారులు పర్యటించేవారని, కార్మికులను కలిసి వారికి అందుతున్న వేతనాలతోపాటు ఇతర సౌకర్యాలను కూడా పరిశీలించేవారని తెలిపారు. ఈ కాలంలో కార్మిక శాఖాధికారుల పర్యటనలు లేవని, చట్టప్రకారం కార్మికులకు ఇవ్వాల్సిన కనీస వేతనాలుగానీ, ఇతర సౌకర్యాలుగానీ, పిఎఫ్, ఇఎస్‌ఐగాని అందడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పని చేస్తున్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉందని తెలిపారు. తక్షణమే ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 30న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న విష జ్వరాలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఒకపక్క వర్షాల నేపథ్యంలో జలుబు, జ్వర పీడితులు అనూహ్యంగా పెరిగిపోయారు. మరోపక్క జ్వరం వచ్చి వారం, పది రోజులైనా ఎక్కడ తగ్గే పరిస్థితి కన్పించడం లేదని వాపోతున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉంది. సామాజిక ఆరోగ్య కేంద్రంలో జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మండలానికి మారుమూల ఉన్న పెదకాపవరం పిహెచ్‌సిలో సైతం ఇదే పరిస్థితి. అర్బన్ హెల్త్ సెంటర్లో ప్రతిరోజూ అనేక మంది జ్వరంతో చికిత్స కోసం వస్తున్నారు. కనీసం ఇంతకు పది రెట్లు, అంతకన్నా ఎక్కువమంది గ్రామాల్లో ఆర్ఎంపిల వద్ద, స్థానిక ప్రయివేట్ ఆసుపత్రుల్లోనూ రోజువారీ వైద్యం చేయించుకుంటున్నారు. చికున్‌గున్యా బాధితుల అవస్థలు వర్ణనాతీతం. పది రోజుల క్రితం స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలో కుప్పనపూడికి చెందిన నాగేశ్వరి బిడ్డను ప్రసవించగా ఆ బిడ్డకు సైతం చికెన్‌గున్యా సోకినట్లు రెండు రోజుల క్రితం నిర్ధారణైందని వైద్యులు మహేష్‌వర్మ తెలిపారు. అయితే పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాత్రం మండలంలో జ్వరాలు గతంలో కంటే బాగా తగ్గాయని చెబుతున్నారు. దుంపగడపలో ప్రస్తుతం మూడు కేసులు మాత్రమే ఉన్నాయని చెప్పారు.

ఆకివీడు సిహెచ్‌సి ఆసుపత్రి

ఆక్వా రైతుల అభివృద్ధికి కృషి

ఆక్వా ఎక్స్‌పో-2024లో వక్తలు

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. శుక్రవారం ఉండి కోట్ల ఫంక్షన్ హాల్లో ఆక్వా ఇంటర్నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎం.ఎ.నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా ఎక్స్‌పో-2024ను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆక్వా రైతులు సరికొత్త మెళకువలు నేర్చుకుని సాగు చేసేందుకు ఆక్వా ఎక్స్ పో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుల అభివృద్ధికి సిద్ధంగా ఉందని, త్వరలోనే విద్యుత్ సబ్సిడీ అమలుకు ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. సుమారు దేశంలో 26 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జరుగుతుంటే కేవలం వెయ్యి టన్నులు మాత్రమే దేశీయంగా విక్రయిస్తున్నారని, మిగిలినవన్నీ ఎగుమతులవుతున్నాయని తెలిపారు. ఆయా దేశాలు ఆక్వా దిగుమతులు మన దేశం నుంచి నిలుపుదల చేస్తే ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని, విదేశీ మారకద్రవ్యానికి లోటు ఏర్పడుతుందని వివరించారు. వీటిని అధిగమించాలంటే రొయ్యలో ప్రోటీన్లు తక్కువగా ఉంటాయని, ప్రతిఒక్కరూ రొయ్యలు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని ప్రచారం చేయాలని, ఈ బాధ్యత ఆక్వా ఉత్పత్తిదారులు, ట్రేడర్లపై ఉందని అన్నారు. అతి త్వరలోనే ఫీడ్, సీడ్ రేట్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగ్గించేందుకు కంపెనీలతో మాట్లాడేలా చూస్తామని రఘురామకృష్ణంరాజు, బీద మస్తాన్‌రావు అన్నారు. కార్యక్రమంలో ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టిజి.మనోజ్‌కుమార్, జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆక్వా డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.కృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు నంబూరి వెంకటరామరాజు, ఆక్వా ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్ ఎమ్‌డి డాక్టర్ యిర్రింకి సూర్యారావు, భీమవరం మిక్రాల్ ఆక్వా ల్యాబ్ ఎ.శ్రీనివాసరావు, ఆకివీడు గీత ఆక్వా ల్యాబ్ పి.గోవిందరావు, భీమవరం దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్ఎం ఎస్.నాగభూషణరావు, సిపిఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జిఎం చక్రిధర్, విశాఖపట్నం అరుణోదయ ఆక్వా ల్యాబ్ ఫీడ్స్, నీడ్స్ జగన్మోహన్, రైతులు, వివిధ ఉత్పత్తుల ప్రదర్శనదారులు పాల్గొన్నారు.

ఆక్వా ఎక్స్‌పో-2024ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ

విద్యతో సమాజ స్ఫూర్తి అవసరం

భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - నరసాపురం

నేటి విద్యార్థులు విద్యతోపాటు సమాజ, రాజకీయ స్ఫూర్తి తప్పనిసరిగా కలిగి ఉండాలని పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్-2024ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెస్ట్ కన్వీనర్ పి.వాసు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యత కలిగి సమాజాన్ని అధ్యయనం చేయాలన్నారు. కేవలం విద్య, ఉద్యోగాలు అన్న నేటి కార్పొరేట్ దృష్టి నుంచి కాకుండా తమ చదువులు సమాజానికి ఉపయోగపడేలాగా తమ జీవనాన్ని సమాజ సేవ కోసం కూడా ఉపయోగించాలన్నారు. సిద్ధాంతాలు లేని రాజకీయ నాయకులను, సినిమా నటులపైనుంచి దృష్టి మళ్లించి స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, గాంధీ, సుభాస్ చంద్రబోస్ ఆశయాలను వారి జీవిత స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. విశిష్ట అతిథి వైఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులవ్వడం ఆందోళనకర అంశమన్నారు. విద్యార్థులు వాటికి దూరంగా ఉండి క్రీడల పట్ల, నైపుణ్యాల పట్ల ఎక్కువ ఆసక్తి చూపాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, బ్యాడ్మింటన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వర్‌రామ్, ఫెస్ట్ కోకన్వీనర్ ఎమ్‌డి.జాన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డి.అనిల్‌బాబు, ఎం.చందు, జి.ధీరజ్, చందు, ఇ.సన, జి.సిరి, నవీన్, పవిత్ర, శృతి, చిరంజీవి విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

జిల్లా ప్రజా రవాణా అధికారిగా వరప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎన్‌విఆర్.వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎపిఎస్‌ఆర్‌టిసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి, తణుకు డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌కుమార్, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి, భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, జిల్లా ఎక్కౌంట్స్ ఆఫీసర్ ఎస్‌వి.రావు, జిల్లా షెడ్యూల్ సెల్ ఇన్‌ఛార్జి ఆర్.బాలసుబ్రమణ్యం, పిఆర్‌ఒ రావి రవికుమార్, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా డిపిటిఒ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను నడిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా భవానిశంకరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా భవానిశంకరి నియమితులయ్యారు. ఆమె నూజివీడు నుంచి ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్‌డిఒగా పని చేసిన కె.చెన్నయ్య బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా సూర్యనారాయణరెడ్డి వ్యవహరించారు.

నరసాపురంఆర్‌డిఒగా దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆర్‌డిఒగా పనిచేస్తున్న ఎం.అచ్యుత్ అంబరీష్ బదిలీ అయ్యారు. ఆయనను నరసాపురం నుంచి ఏలూరు ఆర్‌డిఒగా నియమించారు. నరసాపురం ఆర్‌డిఒగా దాసి రాజును నియమించారు. దాసి రాజు పాలకొల్లు, నరసాపురం తహాశీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం దాసి రాజు ఉయ్యూరు ఆర్‌డిఒగా పని చేసి ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అద్భుత వికాస ప్రయాణం.. జాయ్ రైడ్‌తో

షోరూమ్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

పెట్రోల్ ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో అద్భుత వికాస ప్రయాణం.. జాయ్ రైడ్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌తో సాధ్యమని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జ్యోతి గ్యాస్ ఎదురుగా జాయ్ రైడ్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ షోరూమ్‌ను ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు మహిళలకు, విద్యార్థులకు, వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటు ధరలో లభిస్తున్నాయని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా రోజురోజుకీ కొత్త తరహాలో వివిధ మోడళ్లలో మోటార్ సైకిళ్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఇవి పేద, మధ్యతరగతి ప్రజలకు, వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మెగా ఎక్సేంజ్ మేళాలో భాగంగా పాత వాహనం తీసుకొస్తే సరికొత్త ఎలక్ట్రిక్ వాహనాలు కేవలం రూ.2,999కే అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి వాహనంపై రూ.5 వేల నుండి రూ.50 వేల వరకు ఎక్ఛేంజ్ ఆఫర్‌తోపాటు జీరో వడ్డీ సదుపాయం అందుబాటులో ఉందని నిర్వాహకులు తలుపూరి ప్రసాద్, మట్టపర్తి రవి, తలుపూరి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, వైసిపి యువజన రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, టిడిపి మండలాధ్యక్షులు కేతా మీరయ్య, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, నంబూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ఆర్అండ్‌బి ఉద్యోగ నేత సన్యాసిరావు మృతి

ప్రజాశక్తి - ఉండి

ఆంధ్రప్రదేశ్ హైవేస్, ఆర్అండ్‌బి వర్క్‌ఛార్జిడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌హెచ్.సన్యాసిరావు (90) శుక్రవారం ఉదయం యండగండిలోని స్వగ్రామంలో మృతి చెందారు. ఈయన భీమవరం, కొవ్వూరు ఆర్అండ్‌బి డివిజన్ వర్క్‌ఛార్జిడ్ యూనియన్ కార్యదర్శిగా, పంచాయతీరాజ్ వర్క్‌ఛార్జిడ్ యూనియన్ నాయకుడిగా సేవలందించారు. కార్మికోద్యమ నాయకుడు పి.లక్ష్మీదాస్ అనుచరుడిగా జిల్లాలో ఉద్యమ నిర్మాణంలో చురుకైన పాత్ర వహించారు. సన్యాసిరావుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

నీటి యాజమాన్య సంస్థ సంచాలకులుగా అప్పారావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులుగా కెసిహెచ్ అప్పారావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డ్వామా పీడీగా పనిచేసిన ఎం.ప్రభాకర్ రావు తాడేపల్లిగూడెం డివిజన్ డెవలప్మెంట్ అధికారిగా బదిలీపై వెళ్లారు. అప్పారావు ఇప్పటివరకూ నరసాపురం డివిజన్ డెవలప్మెంట్ అధికారి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారిగా పనిచేసి నీటి యాజమాన్య సంస్థ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సిబ్బంది, ఎపిడిలు, ఎపిఒలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పారావు

మంజూరైన ఇళ్లు నిర్మించకపోతే రద్దే

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు అవుతుందని ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు శుక్రవారం తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు నిర్మించుకునేవారు 2025లోపు నిర్మించుకోవాలన్నారు. నిర్మించుకోకపోతే ఇంటి లోను ఇంటి స్థలం వెనక్కి వెళ్లిపోతాయన్నారు. కట్టుకోవాల్సిన వారు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఇప్పుడున్న లేఅవుట్‌లో కట్టిన ఇళ్లు గాని, స్థలాలు గానీ కొన్నవారు అమ్ముకుంటే చట్టరీత్యా శిక్షాహర్హులన్నారు. అమ్మిన స్థలాలను ప్రభుత్వం జప్తి చేస్తుందని వివరించారు.

పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్న నామాల రాజు

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - గణపవరం

పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కాశిపాడు ఆరోగ్య ఉపకేంద్రం ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే నిర్వహించడం వల్ల దోమలను నివారించవచ్చన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా వస్తాయన్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం, తలపోటు, ఉంటే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం శివకుమారి, ఆశాలు వరలక్ష్మి, క్రిష్ణకుమారి పాల్గొన్నారు.

గ్రూపు దేవాలయాల ఇఒగా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారిగా బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మొగల్తూరు గ్రూపు దేవాలయాల ఇఒగా విధులు నిర్వహిస్తున్న చాగంటి సురేష్ నాయుడు పట్టిసీమ గ్రూపు దేవాలయాలకు బదిలీ అయ్యారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై నూజివీడు గ్రూప్-2 దేవాలయాలకు కార్యనిర్వహణాధికారిగా బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి మొగల్తూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పాలకవర్గ సభ్యులను, గ్రామస్తులను సమన్వయం చేసుకొని ఆలయానికి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని పలువురు గ్రామస్తులు, ఆలయాల సిబ్బంది అభినందించారు.

లక్ష్మణేశ్వరం సొసైటీ జనరల్ బాడీ

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. నరసాపురం సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రర్, సొసైటీ ఇన్‌ఛార్జి కె.లక్ష్మీలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ముదునూరి సత్యనారాయణ రాజు, అకౌంటెంట్ దాసరి శ్రీనివాస్, రైతులు చాగంటి శ్రీరామ చంద్రమూర్తి, గాలి కృష్ణారావు, చాగంటి సూర్యనారాయణ, గ్రంధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

శిక్షణలో పాల్గొన్న మహిళలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ కార్మిక సంస్థ ద్వారా వ్యవస్థాపక అభివద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగేంద్రకుమార్, వ్యవస్థాపక అభివృద్ధి విభాగం ప్రధాన శిక్షకులు పుల్లూరు హేమాద్రి, దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.శోభారాణి పాల్గొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌ఒ సంయుక్త ఆధ్వర్యంలో దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులు 5 రోజులపాటు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగేంద్ర కుమార్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారవ్వడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపార నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు గురించి వివరించారు. పుల్లూరు హేమాద్రి వ్యాపార ఆలోచన, నిర్వహణ, ఆచరణ మార్గాలు, పారిశ్రామికవేత్త లక్షణాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు 30 మంది పాల్గొన్నారు.

ఆలయాల వద్ద భద్రత ఏర్పాటు చేసుకోండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని డిఎస్‌పి విశ్వనాథ్ కోరారు. శుక్రవారం మాగంటి ఫంక్షన్ హాల్లో తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని దేవాలయ ధర్మకర్తల, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల భద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆలయాలు పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, తణుకు సిఐ కొండయ్య పాల్గొన్నారు.

220 మందికి దంత పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం విష్ణు దంతకాలేజీ సహకారంతో ఉచిత దంత శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి ప్రారంభించారు. శిబిరంలో 220 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. 115 మంది విద్యార్థులకు క్లినిక్, పిల్లింగ్, స్కిలింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో విష్ణు దంత కాలేజికి చెందిన 15 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూచంపూడి సురేంద్రకుమార్ రాజు, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వై.మధు రాజు, లెక్చరర్లు సిహెచ్ చైతన్య, కె.స్వరూపరాణి, జి.వెంకటరమణ, జి.వెంకటరావు, బాలమణికంఠ, టి.అక్కిరాజు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతదేహం లభ్యం

విద్యార్థిని సంధ్య మృతదేహం

తణుకు రూరల్ :కాలువలో దూకి గల్లంతైన తణుకు మండలం కోనాల గ్రామానికి చెందిన తానంకి శ్రావణ సంధ్య (14) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపం చెందిన శ్రావణసంధ్య గురువారం ముద్దాపురం మూలలంక కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి శ్రావణసంధ్య ఆచూకీ కోసం అగ్నిమాపక, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపటారు. శుక్రవారం ఉదయం శ్రావణసంధ్య మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెనుగొండ సిఐగా రాయుడు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ సిఐగా రాయుడు విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడలో సింగ్‌నగర్ ట్రాఫిక్ స్టేషన్ నుంచి బదిలీపై పెనుగొండ సిఐగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రామరాజుకు ఘన స్వాగతం

ఆకివీడులో..

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు పదవి చేపట్టిన అనంతరం తొలిసారిగా శుక్రవారం నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు పార్టీ నాయకులు, కూటమి నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. బాణా సంచాలతో, మేళ తాళాలతో వందలాది వాహనాలతో ఊరేగింపుగా ముందుకు కదిలారు. అక్కడనుండి దుంపగడప అడ్డురోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆ గ్రామస్తులు, టిడిపి నాయకుడు పిన్నమరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రామరాజుకు స్వాగతం పలికారు. అక్కడ ఆయన ఆగి కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ నాయకులు ఆకివీడు సెంటర్లో క్రేన్ సహకారంతో, కొందరు, పువ్వులు పండ్లతో వర్తక సంఘం వారు విడివిడిగా గజమాలలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తనకు ఇంతటి అభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అక్కడి నుండి ఐ.భీమవరం వెళ్లారు. ఐ.భీమవరంలో గ్రామస్తులు, నాయకులు రామరాజుకు స్వాగతం పలికి సత్కరించారు గ్రామంలోని ఎన్‌టి రామారావు విగ్రహానికి రామరాజు పూలమాల వేశారు.

కాళ్ల : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించడం ఆనందంగా ఉందని మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం కాళ్లకూరు వెంకటేశ్వరస్వామిని మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి అధ్యక్షులు రామరాజు దర్శించుకున్నారు. నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ కాళ్లకూరు విచ్చేశారు. కాళ్లకూరులో అడ్డాల శివరామరాజు నాగరాజు, వారి కుటుంబ సభ్యులు గజమాలతో సత్కరించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు రామరాజును ఘనంగా సన్మానించారు. ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్, మంతెన రామరాజును ఘనంగా సత్కరించారు.

కాళ్లకూరులో రామరాజు కు గజమాలతో సత్కరిస్తున్న నేతలు

పాలకొల్లు ఎస్ఐగా ప్రసాద్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ ఎస్ఐగా జిజె.ప్రసాద్ నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. భీమవరం నుంచి బదిలీ పై ఇక్కడకు విచ్చేశారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ముత్యాలరావు నరసాపురం బదిలీ అయ్యారు. పోడూరు ఎస్ఐగా కె.సుధాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు రూరల్ ఎస్ఐగా సురేంద్ర నియమితులయ్యారు.

భీమవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా చోడగం వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమిషనర్ తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట కమిషనర్‌గా నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లారు.

రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

భీమవరం విద్యుత్ శాఖ డిఇఇగా రాంబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం విద్యుత్ శాఖ డిఇఇగా కొత్తపల్లి రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెద్దాపురం కమర్షియల్ అండ్ టెక్నికల్ డిఇఇ నుంచి బదిలీపై భీమవరం వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన భీమవరం ఆపరేషన్ డిఇఇ రాజగోపాల్ చౌదరిని తాడేపల్లిగూడెం ఆపరేషన్ డిఇఇగా బదిలీ చేశారు. భీమవరం విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది రాంబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

పెనుమంట్ర ఎఎస్ఐగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ఎఎస్ఐగా మొనవర్తి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో కొంత కాలం నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది, అదే స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించడం విశేషం. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిబ్బంది ఆయనను అభినందించారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ హోమాలు నిర్వహించామని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. కాళ్లకూరులో వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు శుక్రవారం నిర్వహించారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి విరాళం

సాగర్ గ్రంధి ఆక్వా ఎక్స్ పోర్ట్స్ కంపెనీ ఆధ్వర్యాన అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న కంపెనీ అధినేతలు బాలాజీ, చల్లారావు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు సాగర్ గ్రంధి ఆక్వా ఎక్స్ పోర్ట్స్ కంపెనీ నుంచి గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావు కోటి రూపాయల విరాళాన్ని అమరావతిలోని సెక్రటేరియట్‌లో శుక్రవారం చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విజయవాడలో వరదల నేపథ్యంలో ప్రజలు సర్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి బాలాజీని, చల్లారావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గూడూరు ఎంఎల్‌ఎ అనిల్, మాజీ ఎంఎల్‌సి బీరా రవిచంద్రన్ పాల్గొన్నారు.

ఖాతాదారులు అధైర్య పడకండి

ప్రజాశక్తి - ఉండి

ఉండి కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ఖాతాదారులు అధైర్య పడాల్సిన పనిలేదని సొసైటీ స్పెషల్ ఆఫీసర్ పి.ఆనంద్‌రాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం బ్యాంకు ఆవరణలో బ్యాంకు కార్యదర్శి బగాది శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సకల జనుల సమావేశాన్నుద్దేశించి పి.ఆనంద్‌రాజు మాట్లాడుతూ బ్యాంకులో అధికారులు గోల్‌మాల్ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని వారి వద్ద నుంచి వారు అవినీతి చేసిన సొమ్మును రికవరీ చేసే ఏర్పాట్లు పూర్తిచేశామని అదేవిధంగా గత 12 సంవత్సరాలుగా బ్యాంకు నుంచి లోన్లు పొంది ఇంతవరకూ జమ చేయని సుమారు 200 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని, సుమారు రెండు నెలల కాలంలో వాటిని పూర్తిస్థాయిలో వసూలు చేసి బ్యాంకు డిపాజిట్‌దారులకు ఇవ్వడం జరుగుతుందని, పరిస్థితిని అర్థం చేసుకుని ఖాతాదారులు తమకు సహకరించాలని వారు కోరారు.

అందరం కలిసి పనిచేద్దాం : సర్పంచి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అందరం కలిసి పని చేద్దామని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని పంచాయతీలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2047 లక్ష్యాలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బోనం నరసింహారావు, గుబ్బల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.గంగన్న పాల్గొన్నారు.

3 నుంచి మావుళ్లమ్మ దసరా మహోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి దసరా మహోత్సవ వేడుకలు వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరగనున్నాయని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్, పుస్తకాలను ఎంఎల్‌ఎ అంజిబాబు ఆవిష్కరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేద ఆశీర్వచనాలు చేసి బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ మాట్లాడుతూ అమ్మవారికి 3న శ్రీసువర్ణ రజిత కవచాలంకరణ, 4న బాల త్రిపురసుందరీ దేవి, 5న గాయత్రి దేవి, 6న అన్నపూర్ణ దేవి, 7న మహాలక్ష్మి దేవి, 8న లలితా త్రిపుర సుందరీ దేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్ధినిదేవి, 12న రాజ రాజేశ్వరి దేవి అలంకరణ చేస్తామని తెలిపారు. 12న గ్రామోత్సవం మధ్యాహ్నం 1.05 నిమిషాలకు, 14న అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభిస్తారని తెలిపారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే జిఒ 117ను రద్దు చేయాలని ఎస్‌టియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్‌విఎస్ సాయివర్మ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇంగ్లీషు, తెలుగు హిందీ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని లేకుంటే హైస్కూల్లో బోధన కుంటుపడుతుందన్నారు. అసంబద్ధమైన పని సర్దుబాటు వల్ల కొంతమంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్మీడియట్ విభాగానికి గాను ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండర్‌కు అనుసంధానం చేయాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లో ప్రస్తుతం ఉన్న స్కూల్ అసిస్టెంట్లను పిజిటిలుగా డిసిగ్నేషన్ మార్పుచేసి, పూర్తి స్థాయి ఉద్యోగోన్నతుల ద్వారా వారిని నియమించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు మండల అధ్యక్షుడు కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర స్వామి, జిల్లా హెడ్ క్వార్టర్ కార్యదర్శి సుబ్బరాజు, జిల్లా కార్యదర్శులు డి.శ్రీనివాస్, మన్నె వెంకటేశ్వరరావు, అడ్డాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు పెదతాడేపల్లి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఆటల్లో విశేష ప్రతిభ కనబర్చడంతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని ఎస్‌కె.లాల్ బిబి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో అండర్-17, అండర్-14 బాలురు, బాలిక విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారని తెలిపారు. షాట్‌పుట్, డిస్క్ త్రో, వాలీబాల్ కబడ్డీ విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడాకారులను ఎంఇఒ హనుమ, డివైఇఒ రవీంద్ర భారతి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఇటి ఎ.నాగార్జునరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రతి అడుగూ.. గుంతల మడుగు..!

రహదారుల పరిస్థితి దయనీయం - పెద్దపెద్ద గోతులతో వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తరచుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని ప్రధాన మార్టేరు సెంటర్ నుంచి నాలుగు వైపులా ఉన్న రోడ్లు అనేక చోట్ల గోతులుపడి అధ్వానంగా మారాయి. ముఖ్యంగా పాలకొల్లు వైపు వెళ్లే కెనాల్ రోడ్డు, ఆచంట వైపు వెళ్లే కోడేరు రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రోడ్లు వాహనదారులను భయపెడుతున్నాయి. అలాగే మార్టేరు - ఆచంట రోడ్డులో నెగ్గిపూడి శివారు శ్మశానం వద్ద రోడ్డు గోతులు పడి ప్రమాద భరితంగా మారింది. మార్టేరు - గూడెం రోడ్డు వంతెన దిగువ పరిస్థితి అలాగే ఉంది. పెనుగొండ వైపు వనువులమ్మ గుడి వద్ద పెద్ద గోతులను స్థానికులు పూడ్చినా, వర్షానికి మట్టి కొట్టుకు పోయి ప్రమాదకరంగా మారాయి. గూడెం రోడ్డులో కోమటి చెర్వు, ఆలమూరు మడుగు ప్రాంతంలో రోడ్డు బాగా పాడైంది. సంబంధించిన అధికారులు తగు చర్యలు తీసుకొని రోడ్ల పరిస్థితి మార్చాలని పలువురు కోరుతున్నారు.

మార్టేరు సెంటర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

విద్యాశాఖను పశ్చిమలో కలపాలి

ఎంఎల్‌ఎను కోరిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - గణపవరం

ఏలూరు జిల్లాలోని విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో కలపాలని యుటిఎఫ్ మండల నాయకులు గురువారం రాత్రి పిప్పరలో జరిగిన గురుపూజ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజును కోరారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జి.భగవాన్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాశాఖ ఏలూరు జిల్లాలో ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలో ఉందని అందువల్ల తమశాఖను పశ్చిమలో కలపాలని అన్నారు. సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. ధర్మరాజు స్పందించి దీనిపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జె.నాని, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

29న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ ఆఫ్ నరసాపురం వారి ఆధ్వర్యంలో ఈ నెల 29వ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ స్థానిక పాతబజార్, శ్రీ సూర్య స్కూల్ వద్ద ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి తెలిపారు. ఈ మేరకు ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈ మెడికల్ క్యాంప్‌లో విజయవాడ హెల్ప్ హాస్పటల్ డాక్టర్లచే ఎంజియోగ్రామ్, ఇసిజి, ఎకోగుండె స్కానింగ్ వంటి గుండె పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. నరసాపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్లు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నుంచి మాధవరం వరకూ అన్ని రహదారులనూ తక్షణం నిర్మించాలని సిపిఎం మాధవరం గ్రామ శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గోపాల వెంకటరావు అధ్యక్షతన శుక్రవారం మాధవరంలో సిపిఎం గ్రామ శాఖ మహాసభ జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మండల నాయకులు కండెల్లి సోమరాజు హాజరయ్యారు. నూతన కార్యదర్శిగా పురిటిగడ్డ జయమ్మ తిరిగి శాఖ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఆకివీడు : ఆకివీడు 14వ వార్డు జవహర్ పేట రైల్వే గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సిపిఎం 14వ వార్డు శాఖా మహాసభ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక మల్లెల వారి వీధిలో తొమ్మిదో శాఖ మహాసభ జరిగింది. తొలుత సిపిఎం పతాకాన్ని పార్టీ పట్టణ కార్యదర్శి తవిటినాయుడు ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు డోకల లక్ష్మి, నాయకులు ఎస్.కె.వల్లి మాట్లాడారు. అనంతరం శాఖా కార్యదర్శి తన నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ఎర్ర కృష్ణవేణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు సందక ఉదయకుమారి, గోపిశెట్టి రాంబాబు, బివి.వర్మ, ఎస్.సూరిబాబు, జివి.లావణ్య, రాణి, వెంకటలక్ష్మి, రాము పాల్గొన్నారు.

NOTICE
In The Court Of The Senior Civil Judge (Senior Division) Tadepalligudem
O.S.No. 10/2023
Between:
Chilla Varalakshmi ...Plaintiff
AND
Perumalla Venkata Phanindra Kumar ...Defendant
TO: Defendant:
Perumalla Venkata Phanindra Kumar, S/o. Venkata Vijaya Raghava Rao, Age 45 Years, Hindu, Male, Business, D.No.9-76/1, Nethalavari Veedhi, Ganapavaram Mandal, W.G.Dist., TPG PJCJC-534198.
Please take notice that the above suit was filed by the plaintiffs againsty the defendants. The matter is posted for the appearance of the above defendant on 23-12-2024 from 10:30 A.M. onwards, on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.
G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Tadepalligudem, 17-9-24.
Advocates, Tadepalligudem.

SUIT SUMMONS
In The Court Of The 1st Addl. Civil Judge (Junior Division) Tadepalligudem
O.S.No. 404/2023
Between:
1) Dandu Naga Saraswathamma @ Saraswathi
2) Dandu Siva Subramanya Lachi Raju ...Plaintiffs
AND
1) Kalidindi Vijaya Kumar Raju
2) Kalidindi Sai Sudha Rani ...Defendants
TO: 2nd Defendant:
Kalidindi Sai Sudha Rani, W/o. Kalidindi Vijaya Kumar Raju, Aged 60 Years, Hindu, Male, Cultivation, Flat No.101, B-Block, Swarnarama Towers, D.No.6-95/1, Rayalam, Bhimavaram Mandal, W.G.Dist., BVRM PJCJC.
Please take notice that the above suit was filed by the plaintiffs againsty the defendants which is posted for the appearance of the above 2nd defendant on 18-10-2024 from 10:30 A.M. onwards, on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.
G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Tadepalligudem, 15-9-24.
Advocates, Tadepalligudem.